

# అనుమానాలకి హద్దులు లేవా?

యస్. అరవిందాదేవి

అప్పుడే ఆఫీసు వదిలారు. ఆఫీసు ఆవరణదాటి రోడ్డు పైకొచ్చింది సురేఖ. వెనుకనే తమ ఆఫీసులో పనిచేస్తున్న గుమస్తాలు మూర్తి, శర్మ, గిరిల గొంతులు వెకిలిగా వినిపిస్తున్నాయి.

"అలా రోడ్డుపై వెళుతున్న ఆ జవ్వని ఎలా వుందిగురూ!" అన్నాడు గిరి శర్మ వైపు చూసి కన్నుగీటుతూ.

"మాధవునికోసం ఎదురుచూస్తున్న విరహిణి రాధలా, విరిసీ విరియని మల్లెలా, వెన్నెల తీగలా" అంటూ శర్మ కవిత్వం ప్రారంభించాడు.

"అలా ఎదురు చూస్తున్న రాధ హృదిలో మెదిలే మాధవుణ్ణి నేనేగా" అన్నాడు మూర్తి వెకిలిగా.

సురేఖలోని కోపం హద్దులు దాటుతోంది. వెనకనుంచి మాటలు వినిపించడంలేదు. ముగ్గురూ ఏదో గుసగుసలాడుకున్నట్లు సన్నగా మాటలు వినిపిస్తున్నాయి. సురేఖ దేనికైనా సిద్ధంగానే వుంది. అంతలో గిరి ఆమె ప్రక్కగా నడుస్తూ ఆమె జబ్బను రాసుకుంటూ విసురుగా ముందుకు నడిచాడు. ఆ హఠాత్ పరిణామానికి మొదట నివ్వెరపోయినా క్షణంలో తేరుకుంది. క్షణంలో ఆమె కళ్ళు అగ్ని గోళాల్లా ఎర్రబడ్డాయి. దెబ్బతిన్న కోడెనాగులా రోషంగా తల పైకెత్తి "మిస్టర్! ఆగు" అంది సురేఖ గట్టిగా. ఉరుము లేకుండా పిడుగు పడినట్లు అనిపించింది గిరికి. తొట్రుపాటు పడుతూనే నిలబడి ఏం కావాలి అన్నట్లు కళ్ళతోనే ప్రశ్నించాడు.

సురేఖ చక చక రెండడుగులు ముందుకు వేసింది. ఆమె చెయ్యి మెరుపులా పైకిలేచి విసురుగా గిరి చెంపను ముద్దెట్టుకుంది. గిరి కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయ్. "మిస్టర్! జాగ్రత్త! ఈసారి చెంపదెబ్బ రుచిచూశావు. మరోసారి ఇలా వెధవ్వేషాలువేస్తే చెప్పు దెబ్బ రుచి చూస్తావు" అని హెచ్చరించి, విసవిసా ముందుకు నడిచింది సురేఖ. గిరిని కొట్టిన దెబ్బ అతని చెంపకు తగల్లేదు; అతని అహం పైనే బలంగా దెబ్బతీసింది. శర్మ, మూర్తి గబ గబా గిరి దగ్గరగా వచ్చి "ఊర్కోరాగిరి, ఏమను కుంటే ఏంలాభం? ఏదో ఆడదికదా-ఏం చేస్తుందిలే అని దగ్గరగా వెళ్తే చెంపదెబ్బ కొడుతుందా? ఏం పొగరురా దానికి" అంటూ సానుభూతి వాక్యాలు వల్లించారు. కాని గిరి హృదయంలో అగ్నిజ్వాలలు క్రమంగా పెద్దవవుతున్నాయే తప్ప ఆరటంలేదు. మాటుకాలని రోడ్డు మీద 'హు' అని గట్టిగాకొట్టి, "దాని జీవితం నాశనం చేయకపోతే నా పేరు గిరేకాదు. దానంతట అదే ఓకనాడు నా కాళ్ళు పట్టుకునేలా చేస్తా...చూడండి నా పట్టుదల" అంటు కోపంగా బ్రాందీషాప్ వైపు అడుగులు వేశాడు గిరి. పిల్లుల్లా అతని అనుసరించారు శర్మ, మూర్తి.

సురేఖకు పెళ్ళయి దాదాపు రెండేళ్ళు గడిచాయి. దురదృష్టవశాత్తు ఆక్సిడెంట్ మూలాన సురేఖ భర్త మోహన్ కుంటివాడయ్యాడు. అతడు జీవితంపై నిరాశను పెంచుకొని విలపించాడు. తన జీవితం అంధకారమైందని బాధపడ్డాడు. అలాంటి తరుణంలో సురేఖ ధైర్యం వహించింది. గుండెను రాయి చేసుకొని భర్తను తీసుకొని ఆ వూరువదలి హైద్రాబాద్ వచ్చి చేరింది. ఆమె తల్లిదండ్రులు పెద్ద ధనవంతులేం కాదు. అయినా వాళ్ళమీద ఆధారపడటం ఇష్టం లేదు సురేఖకు.

మోహన్ తల్లిదండ్రులు ధనవంతులే కాని సురేఖను కట్నం లేకుండా ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడని కోపం. భగవంతుడు మోహన్‌కు చేసిన అన్యాయానికి వాళ్ళు ఎంతో విలపించారు; ఇంటికి రమ్మన్నారు. కాని ఆత్మాభిమానం గల సురేఖ, మోహన్ ఒప్పుకోలేదు. సురేఖ టైపు నేర్చుకొని, బంధువుల సహాయం వల్ల టైపిస్టుగా ఉద్యోగం చేస్తూంది. ఆలోచిస్తూ వంట చేస్తున్న సురేఖ—భర్త మాటలు విని "ఏం కావాలండీ" అంటూ వంటింట్లోంచే కేక పెట్టింది. "కాస్త కాఫీ పట్టుకొస్తావా? తలనొస్తూంది" అన్నాడు మోహన్ బరువుగా. సురేఖ కాఫీపట్టుకుని ముందు గదిలోకి వచ్చేసరికి కాఫీకోసం కాబోలు వంటింటి వైపే చూస్తున్నాడు. సురేఖను చూసి తలను గట్టిగా పట్టుకొన్నాడు. సురేఖ నవ్వుతూ కాఫీ చేతికిచ్చింది. మోహన్ కాఫీ కప్పు అందుకున్నాడు. "తలనొప్పి అన్నారుగా....మందు ఇస్తాను వేసుకోండి—తగ్గుతుంది" అంది సురేఖ నవ్వును పెదాల మధ్య బంధించి. "అబ్బే ఎందుకూ ఏం వద్దు" అన్నాడు గబగబా. "నాకు తెలియదనుకోకండి. తలనొప్పిలేదు, ఏమీలేదు. అంతా నటన. ఇప్పటికి కాఫీ త్రాగటం ఏ ఎనిమిదోసారో! నేనిటు కాఫీ ఇచ్చి అటు వెళ్ళానో లేదో పక్కింటి కుర్రాడితో నాకు తెలియకుండా సిగరెట్లు తెప్పించుకోవటం తాగడం. ఆ సిగరెట్లు తాగకూడదని ఎన్నిసార్లు చెప్పినా మీరు...." చిరుకోపంతో అంది సురేఖ మందలిస్తున్నట్లు. మోహన్ ఆమె మాటలు విననట్టే కాఫీతాగడంలో నిమగ్నుడయ్యాడు. సురేఖకు చిర్రెత్తుకొచ్చింది. "మీరు ఆ సిగరెట్లు మానేస్తాను అనేదాకా మీతో మాట్లాడను" అంది కోపంగా మూతి బిగించుకొని. మోహన్ మొహం ప్రక్కకు తిప్పుకున్నాడు అలిగినట్లుగా. అరగంట గడిచిపోయింది. ఇద్దరూ మాట్లాడుకోలేదు. సురేఖ మెల్లగా వచ్చి "ఏమండీ నాతో మాట్లాడటం లేదు" అంది రోషంగా. 'నేను నీతో మాట్లాడనని చెప్పలేదుగా?' అన్నాడు మోహన్ చిరునవ్వుతో. "మరి నేనన్నానా" అంది సురేఖ తప్పించుకోబోతూ. "నువ్విలా అబద్ధాలాడటం మానేదాకా నేను నీతో మాట్లాడను" అంటూ సురేఖ గొంతును అనుకరిస్తూ మూతి బిగించాడు మోహన్. సురేఖ పకపకా నవ్వింది అతని అభినయం చూసి. మోహన్ నిండుగా నవ్వాడు.

సురేఖ చక చక టైప్ చేస్తూంది. ఇంకా టైపు